క్లుప్తంగా

శేషవాహనంపై వేణుగోపాలుడు



శేష వాహనంపై ఊరేగుతున్న స్వామి వారు

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో వేంచేసి ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శనివారం శేషవాహనంపై విష్ణుమూర్తి అవతారంలో పూజారి దీవి శ్రీధరాచార్యులు పులతో ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం విద్యుత్ కాంతులతో అత్యంత వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఈఓపీ రామకృష్ణారావు పర్యవేక్షించారు.

స్టేషన్ పాయింట్లు కేటాయించాలి

ఒంగోలు సిటీ: ప్రస్తుతం జరగబోయే ఉపాధ్యాయుల బదిలీల్లో ప్రభుత్వంలో విలీనమైన 230 మంది ఎయిడెడ్ ఉపాధ్యాయులకు స్టేషన్ పాయింట్ మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే వెంకట్రావు, సీహెచ్ ప్రభాకర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం పని చేస్తున్న పాఠశాలల్లో రేషనలైజేషన్‌లో పాఠశాలలు 2022 మార్చి 23 తర్వాత ఎయిడెడ్ ఉపాధ్యాయులు జీవో నెంబర్ 50 ప్రకారం ప్రభుత్వ పాఠశాలలకు సర్దుబాటు చేశారు కనుక వారికి ప్రస్తుత కౌన్సెలింగ్‌లో ఎనిమిది సంవత్సరాలు స్టేషన్ పాయింట్ మంజూరు చేయాలని కోరారు.

వైజేఏ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

సంతనూతలపాడు: యూట్యూబ్ న్యూస్ చానల్స్ ఆఫ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంతనూతలపాడు బస్టాండ్ సెంటర్ వద్ద శనివారం మజ్జిగ పంపిణీ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు పోలుబోయిన వెంకట శివకృష్ణ ఆధ్వర్యంలో జిల్లా సెక్రెటరీ ఇస్తర్ల శ్రీనివాసరావు, సహాయంతో మజ్జిగ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రయాణికుల కోసం మజ్జిగ ఏర్పాటు చేశామన్నారు. త్వరలో అన్ని మండలాల్లో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జై జనం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చావలి రాంబాబు, వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు పలు పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాసంప్రోక్షణ



స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

మార్కాపురం టౌన్: పట్టణ శివార్లలోని జంకె రామిరెడ్డి నగర్‌లో ఉన్న శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టబంధన మహాసంప్రోక్షణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలలో నిర్వహించారు. స్వామి నిజరూప పాద స్పర్శదర్శనాన్ని పలువురు భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ప్రతి 12 ఏళ్లకు ఒకసారి స్వామి ఆలయంలో అష్టబంధన మహా సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు చక్కా మాలకొండ నరసింహరావు, ఉటూకూరి రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. మార్కాపురం పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి పలువురు భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కమిటీ సభ్యులు ఏరువ దేవిరెడ్డి, డీవీఆర్ పాల్గొన్నారు. అర్చకులు అంగరవెంకట కనక నరసింహాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజల్లో స్వవిని ప్రత్యేకంగా అలంకరించారు.

ఆర్టీసీలో తాత్కాలిక డ్రైవర్ల నియామకానికి అవకాశం

గిద్దలూరు రూరల్: గిద్దలూరు ఆర్టీసీ డిపోలో తాత్కాలిక డ్రైవర్లుగా పనిచేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని స్థానిక డిపో మేనేజర్ బి.చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తాత్కాలిక ప్రాతిపదికన డిపో డ్రైవర్లుగా పనిచేసేందుకు 10 మందికి అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. అనుభవజ్ఞులైన డ్రైవర్లు వారి లైసెన్సులతో డిపోలోని అధికారులను సంప్రదించాల్సిందిగా కోరారు. పూర్తి వివరాల కోసం 9959225702 సెల్ నంబరును సంప్రదించాలన్నారు.

గుంతల్లో అభివృద్ధి కనిపిస్తోంది బాబూ..!



చీమలమర్రి-మంచికలపాడు రోడ్డు దుస్థితి ఇలా..



చీమకుర్తి-ఎర్రగుడిపాడు రోడ్డు, మంచికలపాడు జంక్షన్‌లో రాళ్లు తేలిన పరిస్థితి

- చీమలమర్రి-మంచికలపాడు రోడ్డుంతా గుంతలమయం
- చీమకుర్తి-ఎర్రగుడిపాడు రోడ్డులో ప్రయాణికులకు చుక్కలు
- గ్రోత్ సెంటర్‌కు నిత్యం గ్రానైట్ లారీల రాకపోకలు

చీమకుర్తి రూరల్:

కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రహదారులు అధ్వానంగా ఉన్నాయి. 10 నిమిషాల ప్రయాణానికి అరగంటకు పైగా పడుతుందంటే రోడ్లు ఎంత దారుణంగా ఉన్నాయో చూస్తే ఇట్టే అర్థమవుతోంది. ప్రభుత్వం ఏర్పాటై ఏడాదికి దగ్గర పడుతున్నా దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు చేయకుండా పాలకులు చోద్యం చూస్తున్నారు. నిత్యం గత ప్రభుత్వంపై బురద జల్లేందుకే శ్రద్ధ చూపిస్తున్న అధికార టీడీపీ ప్రజాప్రతినిధులు ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్ల సమస్యను పరిష్కరించడంలో మాత్రం ఘోరంగా విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే చీమకుర్తి-ఎర్రగుడిపాడు రోడ్డు, చీమలమర్రి-మంచికలపాడు రోడ్ల మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. చీమలమర్రి-మంచికలపాడు రోడ్డుపై రోజూ వందకు పైగా గ్రానైట్ లారీలు, ఆటోలు, 1000కి పైగా టూ వీలర్లు, అంతే సంఖ్యలో కార్లు ఇలపావులూరు, గ్రోత్ సెంటర్ వరకు ప్రయాణిస్తుంటాయి.

చీమకుర్తి-ఎర్రగుడిపాడు దారంత గుంతలే..

అదేవిధంగా మండల కేంద్రం చీమకుర్తి, జిల్లా కేంద్రం ఒంగోలు 16 గ్రామాల ప్రజలు ఈ రహదారిపై ప్రయాణిస్తూ ఉంటారు. ఇంత బిజీగా ఉన్నన రోడ్డు అధ్వానంగా తయారైంది.

కాని అధికారులు, నాయకులు పట్టించుకున్న పాపాన పోలేదు. చీమకుర్తి-ఎర్రగుడిపాడు వెళ్లే రోడ్డులో వాహనదారులు బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సిన పరిస్థితి. చినరస్తా కూడలి వద్ద గుంతలు పడినరోడ్డులో రాత్రిపూట ఈ రోడ్డుపై తరచుగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రోడ్డు మార్జిన్లు కూడా పూర్తిగా ధ్వంసమై గుంతలుపడ్డాయి. తారు రోడ్డు రూపు కోల్పోయి వాహనదారులు అవస్థలు పడుతున్నారు.

రహదారులకు మరమ్మతులు చేయించాలి..



చీమలమర్రి నుంచి మంచికలపాడు వెళ్లే దారి గుంతలమయంగా తయారైంది. ఈ రోడ్డులో ప్రయాణించాలంటే ప్రజలు చాలా తిప్పలు పడుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి అభివృద్ధి చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి రోడ్ల మరమ్మతులు పూర్తిచేయాలి.

– పొన్నపల్లి నాగేశ్వరరావు, మంచికలపాడు

వాహనదారుల అవస్థలు వర్ణనాతీతం..



ఎర్రగుడిపాడు నుంచి చీమకుర్తికి ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై అడుగడుగునా గుంతలు ఉండటం వలన వాహనదారులు చాలా ఇబ్బందికరంగా ప్రయాణించాల్సి వస్తుంది. కావున కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి రహదారికి మరమ్మతులు చేయించాలి.

– జీ వెంకటరావు, ఎర్రగుడిపాడు

గ్రానైట్ లారీలతో రోడ్ల ధ్వంసం..



చీమకుర్తి నుంచి అధిక సంఖ్యలో గ్రానైట్ లారీలు ఈ రోడ్డు పైనే ప్రయాణించడం వలన రహదారి బాగా దెబ్బతింది. తారు రోడ్డుపై తారు లేకుండా రూపు కోల్పోయింది. వాహనదారులు ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే చుక్కలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి ఈ రహదారిని మరమ్మతులు చేయించాలి.

– జడ మరియదాసు, చీమలమర్రి

పేదలకు అన్నదానం

సంతనూతలపాడు: సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 50వ వారం శనివారం అన్నదాన వేడుకలు నిర్వహించారు. తొట్టెంపూడి నిర్మలాదేవి వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ పావులూరి నారాయణస్వామి చౌదరి, సెక్రటరీ చివుకుల రామ్, గోపాల్ సభ్యులు శీలం మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు



అంబేడ్కర్ పుస్తకాన్ని ధనలక్ష్మికి అందజేస్తున్న నిర్వాహకులు

సంతనూతలపాడు: వెనుకబడిన వర్గాలు అభివృద్ధి చెందడానికి విద్య మూలం అని ప్రముఖ న్యాయవాది నేలటూరి ధనలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని పేర్నమిట్ట శాంతినగర్ కామ్రేడ్ నూకతోటి కోటయ్య కళా ప్రాంగణం ఆవరణలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి విద్యా శిబిరాన్ని శనివారం ఆమె సందర్శించి అనంతరం మాట్లాడారు. ఈ వేసవి ఉచిత విద్యా శిబిరం రెండో ఏడాది నిర్వహించడం ఎంతో అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. మ్యాథ్స్, ఇంగ్లిష్, తదితర సబ్జెక్టులతో పాటు చిన్నారులు కరాటే, పెయింటింగ్, వంటి రంగాల్లో కూడా శిక్షణ ఇవ్వడం ప్రశంసనీయమని ఆమె చెప్పారు. కార్యక్రమానికి స్టడీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ నూకతోటి రవి కుమార్ నేతృత్వం వహించగా, సీఎస్ఆర్ శర్మ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ సాల్మన్, స్టడీ సెంటర్ ఉపాధ్యాయులు కళ్యాణ్, రామాంజనేయులు, కైలా అనురాధ, తైక్వాండో సీనియర్ కోచ్ ఎరిచర్ల కోమల శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో ఫొటోలు అప్‌లోడ్ చేయొద్దు



డ్రోన్ కెమెరాతో పరిశీలిస్తున్న పోలీసులు

మద్దిపాడు:

జాతీయ రహదారిపై గ్రామాల గుండా భారత ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నావికా దళాల వాహనాల కదలికలు కనిపిస్తే దయచేసి ఎలాంటి వీడియోలు రీల్స్ చేయవద్దు.. వాటిని సోషల్ మీడియాలో అసలు పోస్ట్ చేయవద్దని అలా చేసిన వ్యక్తులపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై బి. శివరామయ్య పేర్కొన్నారు. జిల్లా ఉన్నతస్థాయి పోలీసు అధికారుల ఆదేశాల మేరకు మండల పరిధిలోని గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లో జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనాలను తనిఖీ చేస్తూ, డ్రోన్ కెమెరాతో శనివారం పోలీస్ శాఖ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై మాట్లాడుతూ.. జాతీయ రహదారిపై మన గ్రామాల గుండా ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, నావికా దళాల వాహనాల కదలికను వీడియోలు తీయరాదని, వాటిని సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయరాదని ప్రజలను ఆయన కోరారు. ఇలా చేయడం వల్ల శత్రువు దేశాలకు మన ఆర్మీ, యుద్ధ నైపుణ్య వాహనాల విషయాలు తెలుస్తాయని, తద్వారా మన దేశ రక్షణకు నష్టం కలిగించిన వారు అవుతామన్నారు. ఆర్మీ వాహనాల కదలికలపై వీడియోల తీసిన అప్‌లోడ్ చేసినట్లయితే దేశ రక్షణ చట్టాల అనుసారం చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. మండల పరిధిలోని సీతారాంపురం కోష్టాల సెంటర్ వద్ద, వెల్లంపల్లి చిన్న బ్రిడ్జి వద్ద, రాచవారి పాలెం జంక్షన్ వద్ద, గ్రోత్ సెంటర్ వద్ద వ్యతిరేక దిశలో వాహనాలు నడుపుట వలన రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై ప్రధాన కూడలి వద్ద వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా హెల్మెట్, సీట్ బెల్టు ధరించి ప్రయాణించాలని, తాగి వాహనాలు నడపవద్దని, వ్యతిరేక దిశలో ప్రయాణాలు చేయడం ప్రమాదకరం కావున రోడ్ సేఫ్టీ రూల్స్ తప్పక పాటించాలని వాహనదారులకు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన ప్రభుత్వ ఉద్యోగుల సంఘం

ఒంగోలు సిటీ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఒంగోలు పట్టణ శాఖ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు ప్రకాశం జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిన్నపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, వరకుమార్ తెలిపారు. శనివారం ఒంగోలు నందలి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం భవనంలో పట్టణశాఖ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలకు ఎలక్షన్ ఆఫీసర్ సయ్యద్ మసూద్ అలీ, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్ శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడిగా మోటా శ్రీనివాస్ రావు, కార్యదర్శిగా శ్రీకాంత్ రెడ్డి, ట్రెజరర్‌గా ఏసు రత్నం, సహాధ్యక్షుడిగా డీవీ శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఒంగోలు గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ పరిపాలన అధికారి నున్నా విజయలక్ష్మి ఎన్నికై ఉన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీలో భాగస్వామ్య పక్షాన ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు మల్లికార్జున రావు, తెలుగు నాడు కార్యదర్శి ఆంజనేయులు, ఏపీటాసా స్టేట్ సెక్రటరీ అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌లతో విలువైన సమయం వృథా



సమ్మర్ క్యాంపులో పాల్గొన్న చిన్నారులు

ఒంగోలు టౌన్: విద్యార్థులు సెల్ ఫోన్లకు బానిసలై పోయి అత్యంత విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు డీఎల్ ప్రసాద్ చెప్పారు. ప్రకాశం బాలోత్సవ్, ఒంగోలు చిల్డ్రన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం కొప్పోలులోని టెంట్ హౌస్‌లో సమ్మర్ క్యాంపు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడంతో పాటు శాస్త్రీయ ఆలోచనా ధోరణిని అలవాటు చేసేందుకు సమ్మర్ క్యాంపులలో కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ శిబిరంలో పెయింటింగ్, ఒరిగామి, మెమరీ గేమ్స్, సరదా గణితం, హ్యాండ్ రైటింగ్, పాటలను నేర్పించారు. కార్యక్రమంలో వాకా వెంకటేశ్వరరెడ్డి, దాసరి లక్ష్మీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఒంగోలు సిటీ: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు పలు సమస్యలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆమెకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల పునర్వ్యవస్థీకరణ, బదిలీలు, ఉపాధ్యాయుల ప్రమోషన్లకు సమస్యల పరిష్కారం కోసం ఈనెల 12వ తేదీన డీఈవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేయనున్నామని తెలిపారు. 117 జీవో రద్దు చేసి కొత్త జీవో విడుదల చేసి దాని ఆధారంగా మాత్రమే పాఠశాలను పునర్ వ్యవస్థీకరించాలని తెలిపారు. అన్ని ప్రాథమిక పాఠశాలలో 1:20 ఉండే నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయుల నిర్మించాలని, అన్ని మోడల్ ప్రైమరీ స్కూల్లో ఐదు తరగతులను బోధించడానికి ఐదు ఉపాధ్యాయులు ఉండాలన్నారు. బదీల కోసం తక్షణమే బదిలీల కోసం జీవోను విడుదల చేసి సెలవుల్లోనే బదీలు చేయాలన్నారు. ఎస్టీటీలకు మాన్యవల్ కౌన్సిల్ చేపట్టాలని, 610 జీవోలో విధంగా ఉపాధ్యాయుల సినియారిటికి రక్షణ కల్పించాలన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్ హై, జిల్లా కోశాధికారి ఎన్ చిన్నస్వామి, జిల్లా కార్యదర్శిలు నల్లూరి వెంకటేశ్వరరావు, సిహెచ్ ప్రభాకర్ రెడ్డి, ఎం బాలరాజు, కొత్తపట్నం మండల ప్రధాన కార్యదర్శి రమణ మూర్తి, కే హనుమంతురావు పాల్గొన్నారు.

పర్యావరణంపై వ్యాసరచన పోటీలు

ఒంగోలు టౌన్:

జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా స్థాయిలో వ్యాస రచన, వక్తృత్వ, పాటల పోటీలు నిర్వహించనున్నట్లు వలంటీర్ ఎన్వీరాన్‌మెంటల్ ఆర్గనైజేషన్ చైర్మన్ జీ. వీరభద్రాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి 25 తేదీల్లో నిర్వహించే ఈ పోటీలకు 15 ఏళ్లలోపు వయసు కలిగిన బాలబాలికలు అర్హులని తెలిపారు. జూనియర్, సీనియర్ విభాగాలుగా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 16వ తేదీలోపు అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటుగా పోటీల్లో పాల్గొన్న అభ్యర్థులందరికీ సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 95738 96312 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆలయంలో బీజేపీ నాయకుల పూజలు



మోటుమాల రామాలయంలో పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

కొత్తపట్నం: శత్రు దేశం పాకిస్తాన్‌పై భారత దేశ సైనికులకు ప్రాణ నష్టం జరగకుండా విజయం సాధించాలని బీజేపీ నాయకులు పూజలు చేశారు. శనివారం మండలంలోని కొత్తపట్నం, మోటుమాల దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మాకినేని అమర నరసింహం మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో విజయం సాధించాలన్నారు. బీజేపీ సీనియర్ నాయుకుడు వీరబద్రాచారి మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తూ దేశాన్ని అస్థిర పరచాలని చూస్తున్న పాకిస్తాన్‌కు ఈ యుద్ధంలో బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పి.యల్లమందయ్య, సీనియర్ నాయుకులు పురిణి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన కళాశాల విద్యార్థులు

ఒంగోలు సిటీ: స్థానిక క్విస్ కళాశాలలో వివిధ విభాగాల్లో చదువుతున్న 63 మంది విద్యార్థులు ప్రముఖ బహుళ జాతి సాఫ్ట్‌వేర్ సంస్థల్లో ఉద్యోగాలు సాధించారని కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ విభాగాధిపతి డాక్టర్ జగదీష్ శనివారం తెలిపారు. కోఫర్జ్ కంపెనీకి చెందిన పలువురు విభాగాధిపతులు క్విస్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు చేశారు. దాంట్లో భాగంగా విద్యార్థులకు రాత పరీక్ష, టెక్నికల్ రౌండ్స్, హెఆర్ రౌండ్లు నిర్వహించి 63 మందిని ఎంపిక చేశారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకి క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ సూర్య కళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ గాయత్రి, ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ హనుమంతరావు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ కి సంబంధించి విద్యార్థులకి ప్రత్యేక శిక్షణ అందిస్తామని, ప్రతి ఒక్కరూ ఉద్యోగాలు సాధించేలా ప్రత్యేక శ్రద్ధతో శిక్షణ అందిస్తున్నామని కళాశాల యాజమాన్యం తెలిపింది.

పేపర్ క్రాఫ్ట్‌పై అవగాహన

సంతనూతలపాడు: సంతనూతలపాడులోని సుందరయ్య భవనంలో ఐద్వా, జేవీవీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రకాశం బాలోత్సవంలో భాగంగా రెండో రోజు శనివారం కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బీ వీరాస్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయన పిల్లలకు పేపర్ క్రాఫ్ట్ గురించి క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో మండల ఐద్వా కార్యదర్శి ఎస్.మాలతి, కుట్టు శిక్షణ టీచర్ అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

మాలలకు ఆదర్శప్రాయుడు పీవీ రావు

ఒంగోలు వన్‌టౌన్: మాలలకు ఆదర్శ ప్రాయుడు పీవీ రావు అని మాల జేఏసీ చైర్మన్ కొప్పోలు ఏడుకొండలరావు పేర్కొన్నారు. పీవీ రావు జయంతి సందర్భంగా ఒంగోలు అంబేడ్కర్ భవన్‌లో శనివారం సాయంత్రం పీవీ రావు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి పీవీ రావు అని అన్నారు. గతంలో ఎస్సీ వర్గీకరణను రాజ్యాంగ విరుద్ధం అని అనేక పోరాటాలు చేసి సుప్రీం కోర్టులో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడి గెలిచారన్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం హయాంలో జారీ చేసిన ఎస్సీ వర్గీకరణ జీవోను రద్దు చేయించడంలో ముఖ్య పాత్ర పోషించిన వ్యక్తి పీవీ రావు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు మాల్యాద్రి, రవికుమార్, రమేష్, శోభన్‌బాబు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు